స్వర్ణోదయం



రోజూ నిప్పులు చెరుగుతూ ప్రతాపాన్ని చాటుకుంటున్న సూరీడు సువర్ణ ఛాయను సంతరించుకున్నాడు. మబ్బులతో మిళితమై, నీలి కెరటాలు నింగిని తాకిన భావనను సాక్షాత్కరింపజేశాడు. ఆదివారం ఉదయం గగనంలో విరిసిన ఈ మనోహర దృశ్యం రామకుప్పం పట్టణంలో ప్రకృతి ప్రియులను అలరించింది. కాసేపటికి నీలి కెరటాలను చీల్చుకున్నట్టుగా బంగారు రంగులో మరింత మెరిసిన ఆదిత్యుడు కనువిందు చేశాడు. ఉదయం 6.30 గంటల తర్వాత ఎప్పటిలాగే భానుడు 11.30 గంటల వరకు ప్రతాపాన్ని చాటాడు. మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో ముసురుకున్న మబ్బుల చాటుకెళ్లాడు. తర్వాత వరుణుడి ప్రభావంతో చిరుజల్లులు అహ్లాదాన్ని పంచాయి.

- రామకుప్పం, ఆంధ్రజ్యోతి

భక్తులతో కిక్కిరిసిన బోయకొండ

- గంగమ్మకు పంచామృతాభిషేకాలు -





చౌడేపల్లె, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. వేకువజామున అమ్మవారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వర్ణాభరణాలు, పూలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.



పంటలపై ఆగని గజదాడులు



ధ్వంసమైన కొబ్బరి చెట్లు

కల్లూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. పులిచెర్ల మండలంలో అయితే రాత్రయితే పొలాల్లోకి చేరుకుంటున్న ఏనుగుల గుంపు నానా బీభత్సం సృష్టిస్తున్నాయి. శనివారం రాత్రి కూడా తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని బోడబండ నుంచి బయల్దేరిన 16 ఏనుగుల గుంపు దేవళంపేట పంచాయతీ గెండేవారిపల్లె చెరువు వద్దకు చేరుకున్నాయి. చెరువులో మునిగిన ఏనుగుల గుంపు మిట్టమీద రాచపల్లెలోని బసవయ్యకు చెందిన వరి, భాస్కర్‌కు చెందిన టమోటా పంటను ధ్వంసం చేశాయి. పురుషోత్తంరెడ్డికి చెందిన సుమారు వంద కొబ్బరిచెట్లు, వేరుశనగ పంటను నాశనం చేశాయి. మురళికి చెందిన అలసంద పంటను ధ్వంసం చేసి, మామిడిచెట్ల కొమ్మలను విరిచేశాయి. హేమసుందర్‌రెడ్డికి చెందిన మామిడి చెట్ల కొమ్మలను విరిచేసి, పెనుబాల వారిపల్లెలోని నారాయణకు చెందిన కొబ్బరిచెట్లను ధ్వంసం చేశాయి. కురవపల్లెలోని కేశవులు, రాజమ్మకు చెందిన మామిడిచెట్లను ధ్వంసం చేశాక వచ్చిన దారిలోనే అడవిలోకి వెళ్లిపోయాయి. ఏళ్ల కిందటి కొబ్బరి చెట్లు ధ్వంసం చేయడంతో బాధిత రైతులు కంటతడి పెడుతున్నారు. మరోవైపు ఎప్పుడేమి జరుగుతుందోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగుల గుంపు ఆదివారం పగలంతా అడవిలోని సూరప్పచెరువు వద్ద తిష్ఠ వేసినట్లు ఎఫ్‌బీవో మధు తెలిపారు.



తొక్కేసిన వరి పంటలో ఏనుగుల పాదముద్రలు

కలెక్టర్ సారూ.. చర్యలు తీసుకోండి

పులిచెర్లలో సోమవారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎ‌స్‌కు హాజరవుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ మండలంలో కొనసాగుతున్న ఏనుగుల దాడులపై తగిన చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు. ఏనుగుల దాడులతో ఎక్కువగా నష్టపోతోంది తామేనని, నష్టపరిహారం కూడా తూతూమంత్రంగా అందుతోందని, విచారించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నయనంపల్లెలో ఇలా..

ఐరాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఐరాల పంచాయతీ నయనంపల్లెలో శనివారం రాత్రి రెండు ఏనుగులు పంట పొలాలపై దాడి చేశాయి. గ్రామంలోని చిన్నయ్యకు చెందిన ఐదు గుంటలు, రాఘవయ్యకు చెందిన నాలుగు గుంటల టమోటా పంటను తొక్కి నాశనం చేశాయి. అపోలో వారి తోట వద్ద రాతి కూసాలను విరిచేశాయి. ప్రస్తుతానికి ఏనుగులు అటవీ ప్రాంతంలోని బాలింతమ్మ ఆలయం వద్ద ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఏనుగులు గ్రామం వైపు వస్తున్నాయన్న సమాచారంతో రైతులెవరూ పొలాల వద్దకు వెళ్లలేదు.



ఏనుగులు తొక్కేసిన టమోటా పంట

పులిచెర్లలో నేడు 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం సోమవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు పాల్గొంటున్న ఈ కార్యక్రమాన్ని పులిచెర్ల, రొంపిచెర్ల మండలాలకు చెందిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కలెక్టరేట్‌కు రావొద్దు

కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ నిర్వహించడం లేదని, ప్రజలెవరూ వ్యయ ప్రయాసలకోర్చి జిల్లా కేంద్రానికి రావద్దని కలెక్టర్ సూచించారు. జిల్లాస్థాయి అధికారులందరూ పులిచెర్లలో ఉంటారని పేర్కొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో యథావిధిగా..

ఎస్పీ కార్యాలయంలో యథావిధిగా సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ మణికంఠ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి విజ్ఞప్తులను తీసుకుంటారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బ్యాంకు ఖాతాదారులకు ఈకేవైసీ తప్పనిసరి

- సైబర్ నేరగాళ్ల బారినుంచి కాపాడటమే ఆర్బీఐ సంకల్పం



చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల బారి నుంచి కాపాడటానికి, ఆర్థిక నేరాలకు అడ్డుకట్ట వేయడానికి ఆర్బీఐ సంకల్పించింది. ఇందులో భాగంగానే అన్ని జాతీయ, ప్రైవేటు బ్యాంకుల్లో ఖాతాదారులకు ఈకేవైసీ (ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) తప్పనిసరి చేసింది.

ఎందుకంటే..

ఏదైనా బ్యాంకులో ఖాతా ప్రారంభించాక ఏడాదిపాటు ఎలాంటి ఆర్థిక లావాదేవీలు జరపకుంటే నిలిచిపోతుంది. ఇలాంటి ఖాతాల వివరాలను సైబర్ నేరగాళ్లు సేకరించి, సాంకేతిక పరిజ్ఞానంతో ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి ఖాతాదారులు ఈకేవైసీ చేయించుకోవడం ద్వారా సైబర్ నేరాలను నివారించవచ్చు.

అసహనానికి గురవుతున్న ఖాతాదారులు

జిల్లాలోని పలు బ్యాంకుల్లో ఖాతాదారుల వ్యక్తిగత, సంయుక్త ఖాతాలు ఇటీవల అధిక సంఖ్యలో నిలిచిపోతున్నాయి. ఒకేసారి ఎక్కువ సంఖ్యలో బ్యాంకులకు వెళుతుండటంతో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ఫలితంగా ఖాతాల పునరుద్ధరణలో జాప్యం నెలకొని, ఖాతాదారులు అసహనానికి గురవుతున్నారు.

మూడు రకాల ఖాతాలు

మొదటి రకం.. సాధారణ ఖాతాదారులు పదేళ్లకోసారి, రెండోరకం.. మధ్యస్థంగా ఉన్నవారు ఐదేళ్లకోసారి, మూడోరకం.. హైరిస్క్ ఖాతాదారులు రెండేళ్లకోసారి ఈకేవైసీ చేయించుకోవాలి.

ఆందోళన వద్దు



ఎవరికైనా బ్యాంకు ఖాతా నిలిచిపోతే ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఆధార్, పాన్ కార్డు నకళ్లు బ్యాంకు సిబ్బందికి అందజేస్తే సరిపోతుంది. ఏడాదిలో కనీసం ఒక్కసారైనా ఖాతా ద్వారా ఆర్థిక లావాదేవీలు నిర్వహించాలి.

- ఎ.హరీష్, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్

నేడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి రాక

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సోమవారం చిత్తూరుకు రానున్నారు. ఉదయం ఎనిమిది గంటలకు స్థానిక దుర్గా హోటల్ వద్ద చాయ్‌పే చర్చా కార్యక్రమంలో పాల్గొని ఆర్అండ్‌బీ అతిథిగృహానికి చేరుకుంటారు. ఉదయం 10 గంటలకు కలెక్టర్ బంగ్లా సర్కిల్‌లోని కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహానికి నివాళి, 10.30 గంటలకు కట్టమంచి చెరువు సమీపంలోని వివేకానంద విగ్రహం నుంచి హైరోడ్డు వరకు తిరంగా ర్యాలీ, మధ్యాహ్నం 12 గంటలకు ఎన్పీసీ పెవిలాన్‌లో జిల్లా కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారని బీజేపీ వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపాయి.

'అయ్యో'ర్లకే పరీక్ష..!
- నేటినుంచి ఎఫ్ఏ-1 పరీక్షలు

పుంగనూరుకు త్వరలోనే హంద్రీ-నీవా జలాలు
- టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి

శునకాల దాడులతో 20 జీవాల మృతి

- వివరాలు 7లో -

కష్టాల కొలిమి నుంచి పుట్టుకొచ్చిన సీపీఐ

- జిల్లా మహాసభల్లో జాతీయ కార్యదర్శి నారాయణ -

నగరి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కష్టాల కొలిమి నుంచి సీపీఐ పుట్టుకొచ్చిందని జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. నగరిలో జిల్లాస్థాయి మహాసభలు జరుగుతున్న విషయం తెలిసిందే. రెండోరోజైన ఆదివారం ప్రతినిధుల సభ నిర్వహించారు. జిల్లా కార్యదర్శి జనార్దన్ గత మహాసభల నుంచి ఇప్పటివరకు అమరులైన వారికి సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. అనంతరం నారాయణ మాట్లాడుతూ.. సమాజంలో పెట్టుబడి, శ్రామికవర్గాలు మాత్రమే ఉన్నాయని చెప్పారు. సీపీఐ అణగారిన వర్గాల కోసం పోరాటాలు చేస్తూనే ఉంటుందన్నారు. పీ-4 పథకంతో పేదరికాన్ని పారదోలే ఆలోచన కంటే వారికి ఉపాధి అవకాశాలు కల్పించి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. చిత్తూరులో రౌడీలను తరిమికొట్టిన ఘనత తమకే దక్కుతుందన్నారు. పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని కార్యవర్గ సభ్యుడు రామానాయుడు పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యదర్శి హరినాథరెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 23వ తేదీన ఒంగోలులో జరిగే మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా చేతులెత్తేయడం సీఎం చంద్రబాబు తీరుకు నిదర్శనమని విమర్శించారు. కోదండయ్య, విజయగౌరి, ప్రవీణ్, నాగరాజన్, పెంచలయ్య, గుర్రప్ప, హరిబాబు, డప్పు సూరి, కార్యకర్తలు పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న నారాయణ



చిత్తూరులో కురుస్తున్న జోరువాన

25 మండలాల్లో వర్షం

చిత్తూరు అర్బన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా శనివారం ఉదయం ఎనిమిది నుంచి ఆదివారం ఉదయం ఎనిమిది గంటల వరకు 25 మండలాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం పడింది. అత్యధికంగా ఐరాలలో 72 మి.మీ వర్షపాతం నమోదవగా, అత్యల్పంగా చౌడేపల్లె, గుడుపల్లె, కుప్పం మండలాల్లో ఒక మి.మీ వర్షం కురిసింది. మండలాలవారీగా.. పలమనేరులో 45.2, రామకుప్పంలో 38.8, బంగారుపాళ్యంలో 37, గంగవరంలో 35.4, వి.కోటలో 32.4, పెద్దపంజాణిలో 25.2, పుంగనూరు, గంగాధరనెల్లూరులో 23, చిత్తూరు రూరల్‌లో 19.6, యాదమరిలో 18.8, బైరెడ్డిపల్లెలో 18.2, శ్రీరంగరాజపురంలో 14.8, పులిచెర్లలో 11, తవణంపల్లెలో 10, చిత్తూరు అర్బన్‌లో 8.4, శాంతిపురంలో 6.4, రొంపిచెర్లలో 6.2, గుడిపాలలో 3.6, పూతలపట్టులో 2.4, పెనుమూరులో 2, కార్వేటినగరంలో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

ఐదు 'విండో'లకు త్రిసభ్య కమిటీలు

చిత్తూరు అర్బన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటి వరకు సహకార శాఖ అధికారులచే కొనసాగుతూ వచ్చిన ఐదు సింగిల్‌విండోలకు ప్రభుత్వం త్రిసభ్య కమిటీలను నియమించింది. వీటిల్లో చవటగుంట, పలమనేరు, రొంపిచెర్ల, తవణంపల్లె, గంగాధరనెల్లూరు సింగిల్ విండోలున్నాయి. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

'అయ్యో'ర్లకే పరీక్ష..!

వెదురుకుప్పం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): విద్యా సంస్కరణల్లో మార్పులతో అయ్యోర్లకే పరీక్ష ఎదురుకానుందన్న విమర్శలొస్తున్నాయి. సోమవారం నుంచి ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు ఫార్మేటివ్ అసెస్మెంట్-1 (ఎఫ్‌ఏ-1) పరీక్షలు మొదలవుతున్నాయి. ఈ ప్రశ్నపత్రాలు లీక్ కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమే దీనికి కారణమని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొంటున్నాయి.

ఎందుకంటే..

ఒకటి నుంచి ఐదో తరగతి వరకు కేటాయించిన సీఆర్సీ (హైస్కూల్) నుంచి రోజూ పరీక్ష సమయానికి గంట ముందుగా విధులు కేటాయించిన ఉపాధ్యాయుడు సంబంధిత పాఠశాలకు ప్రశ్నపత్రాలను తీసుకెళ్లాలి. ఆరు నుంచి పదో తరగతి వరకు ప్రశ్నపత్రాలను ఏకంగా ఎమ్మార్సీ ఆఫీస్ నుంచి పరీక్షకు గంట ముందుగా టీచరు తీసుకెళ్లాలి. ఇంతవరకు బాగానే ఉన్నా.. కొన్నిచోట్ల సీఆర్సీ ఎమ్మార్సీ ఆఫీసులు పది కిలోమీటర్లకుపైగా ఉండటంతో టీచర్లకు ఇబ్బందులు తప్పేలా లేవు. ఇక్కడే వీరికి పరీక్ష ఎదురుకానుంది.

లీకైతే హెచ్‌ఎంపై చర్యలు

ఏ పాఠశాలలో ప్రశ్నపత్రం లీకైనా హెచ్‌ఎంపై శాఖాపరమైన చర్యలు తీసుకోవచ్చు. ఈ నిర్ణయం మంచిది కాదని ఉపాధ్యాయ సంఘాల నేతలు అంటున్నారు.

ఏకోపాధ్యాయ పాఠశాలల్లో మరిన్ని సమస్యలు

ఏకోపాధ్యాయ పాఠశాలల్లో మరిన్ని సమస్యలు ఉత్పన్నం కానున్నాయి. టీచర్.. ప్రశ్నపత్రాలకు వెళ్లిన సమయంలో విద్యార్థులను చూసుకోవడానికి బడిలో ఎవరూ ఉండరు. అలాంటి సందర్భాల్లో పిల్లలు చెట్లు ఎక్కడం, గోడలు దూకడం, ఇతరత్రా పనులకు పాల్పడితే ఎవరు బాధ్యత వహిస్తారన్నది ప్రశ్న.

నేటినుంచి ఎఫ్‌ఏ-1 పరీక్షలు

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో సోమవారం నుంచి ఫార్మేటివ్ అసెస్మెంట్-1 పరీక్షలు మొదలు కానున్నాయి. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు సోమవారం నుంచి బుధవారం వరకు, ఆరు నుంచి పదో తరగతి వరకు సోమవారం నుంచి గురువారం వరకు పరీక్షలు జరగనున్నాయి. 1-8 తరగతులకు ఉదయం 9.30 నుంచి 10.45 గంటల వరకు, మధ్యాహ్నం 1.15 నుంచి 2.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. 9, 10 తరగతులకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు, మధ్యాహ్నం 2.45 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల్లోని 2,955 పాఠశాలల్లో 2,60,641 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో 2,462 ప్రభుత్వ బడుల్లో 1,48,430 మంది విద్యార్థులు, 493 ప్రైవేటు యాజమాన్య పాఠశాలల్లో 1,12,211 మంది ఉన్నారు.

ఈ ఏడాది నుంచి ఒకే బుక్‌లెట్

ఈ ఏడాదినుంచి జవాబుపత్రాల తీరు మారనుంది. ఇప్పటివరకు ప్రశ్నపత్రాలతోపాటు జవాబులు రాసేందుకు కాగితాలు ఇస్తున్నారు. ఈ ఏడాది నుంచి అలాకాకుండా అన్నిరకాల పరీక్షలకు సమాధానాల్ని రాసేలా ఒకే బుక్‌లెట్ ఇవ్వనున్నారు. గణితానికి సంబంధించి గ్రాఫ్, సాంఘికశాస్త్రం మ్యాపులతోనూ పేజీలు ముద్రించారు. 1, 2 తరగతుల విద్యార్థులకు మూడు బుక్‌లెట్లు, 3-5 తరగతుల విద్యార్థులకు నాలుగు బుక్‌లెట్లు, 6,7 తరగతులకు ఆరు బుక్‌లెట్లు, 8-10 తరగతుల విద్యార్థులకు ఏడు బుక్‌లెట్లు అందజేయనున్నారు. ప్రాథమిక తరగతులకు ఇచ్చే బుక్‌లెట్‌లో 50 పేజీలు, ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఇచ్చే బుక్‌లెట్‌లో 70పేజీలు ఉండనున్నాయి.

చెరువులోపడి ఒంటరి మహిళ మృతి



వెంకటలక్ష్మి మృతదేహం

కుప్పం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణంలోని డీకే పల్లె చెరువులోపడి ఒంటరి మహిళ మృతి చెందారు. కుప్పం అర్బన్ సీఐ శంకరయ్య, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. వెంకటలక్ష్మి (30)కి పదేళ్ల క్రితం వివాహమైనా భర్త నుంచి విడాకులు తీసుకుంది. తల్లిదండ్రులు చనిపోవడంతో కొత్తపేటలో ఒంటరిగా నివాసముంటోంది. ఈ క్రమంలో దుస్తులు ఉతుక్కుని స్నానం చేయడానికి ఆదివారం డీకే పల్లె చెరువుకు వెళ్లింది. తలస్నానం చేయడానికి ప్రయత్నిస్తూ ప్రమాదవశాత్తూ జారి చెరువులో పడిపోయింది. ఆ ప్రాంతంలో లోతైన గుంతలు ఉండటంతో బయటకు రాలేక మృతి చెందింది. పోలీసులు వెంకటలక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

నిండిన చెరువు

మునిగిన వరిపొలాలు

పలమనేరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలం నక్కపల్లె చెరువు మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా నిండి కలుజు పారుతోంది. ఆయకట్టులోని వరి పొలాలు పూర్తిగా నీట మునిగాయి. దీంతో రైతులు ఆందోళన పడుతున్నారు. 20 రోజుల కిందట కురిసిన వర్షాలకు చెరువుకు నీరు చేరడంతో వరినాట్లు వేశారు. ఇప్పుడిప్పుడే వరిపైరు పెరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుత వర్షాలకు పంటపొలాలు నీట మునగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





నక్కపల్లె చెరువు నిండి పారుతున్న కలుజు - మునిగిన వరి పొలాలు

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ప్రవీణ్



చిత్తూరు అర్బన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా డి.ప్రవీణ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ద్వారా నియామక పత్రాన్ని అందుకున్నాడు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ.. బీసీలే కాకుండా ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి తనవంతు కృషిచేస్తానని తెలిపారు.

చిత్తూరు ఆర్టీసీ బస్టాండును
ముంచెత్తిన వరదనీరు

తీవ్రంగా ఇబ్బందిపడ్డ ప్రయాణికులు

చిత్తూరు రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో రెండ్రోజులుగా కురుస్తున్న వర్షానికి ఆర్టీసీ బస్టాండు పరిసరాలను వరదనీరు ముంచెత్తింది. ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. కట్టమంచి చెరువు సుందరీకరణలో భాగంగా పూడికతీత పనులు జరుగుతున్నాయి. ఈ కారణంగా చెరువుకు వరదనీరు వచ్చే మార్గాలన్నింటినీ మూసివేశారు. దీనివల్ల బస్టాండును ఆనుకుని ఉన్న కట్టమంచి చెరువు సప్లయ్ చానల్‌కు వచ్చిన భారీగా వరదనీరు పక్కనే ఆర్టీసీ బస్టాండు పరిసరాల్లోకి చేరింది. ఆర్టీసీ బస్టాండుకు, రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్లు జలమయం అయ్యాయి. బస్టాండ్‌లోని సైకిల్ పార్కింగ్ ప్రాంతం కూడా నీట మునిగింది. కట్టమంచిలోని ఎల్‌జీబీ టవర్స్ రైల్వే అండర్ పాస్ వద్దకు వరద నీరు చేరింది.



వరదనీటిలో ఆర్టీసీ బస్టాండు

ప్రత్యామ్నాయ మార్గం మాటేమిటి?

వరదనీరు వెళ్లడానికి ప్రత్యామ్నాయ మార్గాన్ని మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు ఏర్పాటు చేయక పోవడమే దీనికి కారణమన్న విమర్శలొస్తున్నాయి. అసలే వర్షా కాలం.. అందులోనూ కట్టమంచి చెరువు సప్లయ్ చానల్‌ను గిరింపేట గంగినేని చెరువుకు అనుసంధానం చేయడంతోపాటు ప్రధాన మురుగు కాలువలు కూడా దీనికి కలుస్తాయి. దీనివల్ల ఎక్కడెక్కడి నుంచో వరదనీరు ఈ కాలువగుండా వచ్చి కట్టమంచి చెరువులో చేరాలి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



జలమయమైన ఆర్టీసీ బస్టాండు పరిసరాలు

వరసిద్ధుడి సేవలో ప్రముఖులు



జిల్లా జడ్జి జస్టిస్ అరుణసారికకు శేషవస్త్రాలు, పట్టాభిరామ్‌కు జ్ఞాపికను అందిస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. చిత్తూరు జిల్లా జడ్జి జస్టిస్ అరుణసారిక, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ స్వామిని విడివిడిగా దర్శించుకున్నారు. వారిని ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, ఎస్‌ఐ నరసింహులు పాల్గొన్నారు.

పుంగనూరుకు త్వరలోనే హంద్రీ-నీవా జలాలు

టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి



హంద్రీ-నీవా కాలువ పనులను పరిశీలిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా జలాలు త్వరలోనే పుంగనూరు ప్రాంతానికి వస్తాయని టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం పుంగనూరు సమీపంలోని మార్లపల్లె వద్ద జరుగుతున్న హంద్రీ-నీవా కాల్వ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలను మోసం చేయడానికి హంద్రీ-నీవా కాల్వ ద్వారా సాగు, తాగునీరు ఇస్తున్నట్లు తూతూ మంత్రంగా నీరు వదిలారని ఎద్దేవ చేశారు. అప్పటి సీఎం జగన్ హంగామా చేసి.. సినిమా సెట్టింగ్‌లా మోటార్లు ఏర్పాటు చేసి, అదేరోజు వాటిని తీసుకెళ్లగా కాల్వల్లో నీరు మాయమై అభాసుపాలయ్యారని గుర్తుచేశారు. ఇక కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని సీఎం చంద్రబాబు అమలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈనెల 15వ తేదీనుంచి మహిళలకు ఉచిత బస్సుప్రయాణం అమలు చేస్తారని తెలిపారు. ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్ర రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పనులు ప్రారంభించిన ఘనత చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కే దక్కుతుందన్నారు. వైసీపీ నేతలు తమ ఉనికి కోసం ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని, వాటిని ప్రజలు నమ్మరన్నారు. అనంతరం అరడిగుంట పంచాయతీ జోకొత్తూరులో ఇటీవల టీడీపీ కార్యకర్తలు కార్తీక్‌కుమార్‌నాయుడు, వనమలదిన్నెలో రంగస్వామినాయుడు మృతి చెందడంతో వారి ఇళ్లకు వెళ్లి కుటుంబీకులను పరామర్శించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఎన్.శమీపతి, టీడీపీ నాయకులు మాధవరెడ్డి, సీవీరెడ్డి, పోలీసుగిరి, కృష్ణానాయక్, రామకృష్ణమరాజు, మోహన్‌రెడ్డి, సుహేల్‌బాషా, వెంకటరెడ్డి, ఇబ్రహీం, గంగాధర్, డీకే శ్రీనివాసులు, రామకృష్ణ, గిరిబాబునాయుడు, ప్రసాద్‌స్వామి, కవిత, రమణ, సుబ్రహ్మణ్యం, రాంబాబు, రమణ, జనసేన నాయకులు విరూపాక్షి, హరినాయక్, బాలాజీ నాయక్, పవన్‌కుమార్, కుమార్, శ్రీనివాసులు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

శునకాల దాడులతో
20 జీవాల మృతి

సోమల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వీధికుక్కల దాడులతో 20 జీవాలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన ఆదివారం సోమల మండలం కందూరులో జరిగింది. కందూరులోని పాలెంవీధికి చెందిన చిన్నబ్బ.. జీవాల (గొర్రెలు, పొట్టేళ్లు) పెంపకమే జీవనోపాధిగా సాగిస్తున్నాడు. శనివారం రాత్రి ఇంటి సమీపంలోని మందపై వీధి కుక్కలు దాడి చేశాయి. గొర్రెల అరుపులతో చిన్నబ్బ మంద వద్దకొచ్చి చూడగా 17 మృతి చెంది కనిపించాయి. ఐదు జీవాలు తీవ్రంగా గాయపడ్డాయి. సుమారు రూ.1.50 లక్షల మేరకు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. అలాగే గత శుక్రవారం ఇదే గ్రామానికి చెందిన వెంకటేశ్ గొర్రెల పాక వద్ద మూడు గొర్రెలు కూడా వీధికుక్కల దాడులతో మృతి చెందినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు స్పందించి వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకుని, బాధితులకు ఆర్థిక సాయం చేయాలని కోరుతున్నారు.



మృతిచెందిన జీవాల వద్ద బాధితులు

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



శ్రీకాళహస్తి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళ హస్తీశ్వరాలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెల కొంది. వరుస సెలవులు కావడంతో కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వ చ్చారు. సుమారు 28 వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

వైభవంగా రాజగోపురానికి భూమిపూజ

టీటీడీలో విలీనం చేసుకోవాలని వినతి

నింద్ర, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నింద్రలో టీటీడీ నిధులతో నూతనంగా నిర్మించిన ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయానికి అనుబంధంగా నిర్మించనున్న రాజగోపురానికి ఆదివారం భూమిపూజ వైభవంగా జరిగింది. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం నిర్వహించిన ఈ కార్యక్రమంలో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నింద్ర గ్రామానికి చెందిన ఆలయ ధర్మకర్త ఆర్వేల రమేష్ ఎమ్మెల్యేకు ఆలయ పూర్వ వైభవాన్ని, విశిష్టతను వివరించారు. ఆలయం శిథిలమైన తరువాత అదేస్థానంలో నూతనంగా నిర్మించిన ఆలయానికి పూర్వ వైభవం తీసుకురావడానికి కృషిచేయాలని కోరారు. ఈ ఆలయాన్ని టీటీడీలో విలీనం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకి విజ్ఞప్తి చేయగా, ఆయన సానుకూలంగా స్పందించారని రమేష్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి నింద్ర గ్రామానికి చెందిన బలిజ సంఘం వారు కూడా నగదు అందించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, ఆలయ ధర్మకర్త ఆర్వేల రమేష్


దళితులను పావులుగా వాడుకుంటున్న వైసీపీ

- టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆరోపణ



మీడియాతో మాట్లాడుతున్న వెంకటరమణ

చిత్తూరు సిటీ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): దళిత యువకులను కొంతమంది వైసీపీ నాయకులు తమ అక్రమ వ్యాపారాలకు పావులుగా వాడుకుంటూ కోట్లు సంపాదిస్తున్నారని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముల్లంగి వెంకటరమణ ఆరోపించారు. ఆదివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పులిచెర్ల మండలానికి చెందిన దళిత యువకుడిని తిరుపతిలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, ఆయన కుమారుడు అభినయ్ అనుచరులు అతి దారుణంగా కొట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. వైసీపీ పుట్టిందే జైలులో అని, ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ జీవితమంతా నేరచరిత్రనే అని మండిపడ్డారు. జగన్ సొంత చెల్లెలే ఆయన అక్రమంగా రూ.లక్ష కోట్లు సంపాదించారని చెబుతున్నారని అన్నారు. ఇక జనచైతన్య రియల్ ఎస్టేట్ సంస్థలో సాధారణ ఉద్యోగిగా పనిచేసిన చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఈరోజు వేల కోట్లు ఎలా సంపాదించాడో చెప్పాలన్నారు. నేతలు మోహన్‌రాజ్, అశోకన్, రాజా, మేషాక్, గోపాల్ పాల్గొన్నారు.





టీడీపీ కార్యకర్తలకు వైసీపీ కండువా వేసిన నేతలు - చల్లా రామచంద్రారెడ్డికి విషయం తెలియజేస్తున్న టీడీపీ కార్యకర్తలు

టీడీపీ కార్యకర్తలను మభ్యపెట్టలేరు

పుంగనూరు ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి

చౌడేపల్లె, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తలను మభ్యపెట్టలేరని పుంగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం ఉదయం ఫొటో తీసుకుంటామని చెప్పి నలుగురు టీడీపీ కార్యకర్తలకు వైసీపీ కండువాలు కప్పారంటూ మండిపడ్డారు. మూడ్రోజుల కిందట కూడా ఇలాగే కండువాలు కప్పి భంగపడ్డారన్నారు. నాటకీయంగా జరిగిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం ఉదయం చౌడేపల్లె మండలంలోని అమినిగుంట పంచాయతీ సింగిరిగుంటకు చెందిన టీడీపీ కార్యకర్తలు ప్రకాష్‌నాయుడు, రాజశేఖర్ నాయుడు, నాగరాజునాయుడు, నగేష్‌లు తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి సమక్షంలో వైసీపీ తీర్థం పుచ్చుకున్నారని అదే గ్రామానికి టీడీపీ నాయకుడు, బోయకొండ మాజీ కమిటీ సభ్యుడు జంపాల శ్రీనివాసులు నాయుడికి తెలిసింది. ఆయన అప్పటికే అనారోగ్య కారణంగా మదనపల్లెలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలియడంతో వెంటనే డిశ్చార్జి చేసుకుని గ్రామానికి వచ్చి ఆరా తీశారు. ఫొటో తీసుకుంటామని చెప్పి కండువాలు కప్పారని నలుగురు టీడీపీ కార్యకర్తలు తెలిపారు. దాంతో ఈ నలుగురినీ తెల్లనీళ్లపల్లెలోని మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి ఇంటికి తీసుకెళ్లగా అక్కడ పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ కండువాలు కప్పారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యకర్త నగేష్ మాట్లాడుతూ.. కూలీ పనుల కోసం తామంతా సింగిరిగుంట బస్టాప్ వద్ద నిలబడి ఉండగా.. వైసీపీ నాయకులొచ్చి ఫొటో తీసుకుంటామని కండువాలు కప్పారని చెప్పారు. అంతేతప్ప తాము ఏ పార్టీలో చేరలేదన్నారు. ఊపిరి ఉన్నంత వరకు టీడీపీలోనే ఉంటామని తెలిపారు.

ఆధ్యాత్మికతతో సామాజిక పరివర్తన



ప్రచార పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పీఎస్ఎం తదితరులు

కుప్పం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతో సామాజిక పరివర్తన సాధ్యమవుతుందని ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి 21 వరకు నిర్వహించనున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు సమితి ప్రతినిధులు ఆదివారం ఆయన్ను ఆహ్వానించారు. ఆయనచే ఈ వేడుకలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఎస్ఎం మాట్లాడుతూ సమాజంలో చెడును తొలగించి మంచిని, మనుషుల్లో సత్ప్రవర్తనలను ప్రోత్సహించడానికి శ్రీకృష్ణ జన్మాష్టమి వంటి ఆధ్యాత్మిక వేడుకలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. మనసులు పవిత్రతతో ఉంటే సమాజం పవిత్రత పొంది మనిషికి సాటి మనిషి సాయం అందుతుందన్నారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ కుప్పం పట్టణం ప్యాలెస్ రోడ్డులోని జమీందారు బంగ్లా వద్ద ఈనెల 16 నుంచి 21 వరకు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. చివరి రోజైన 21న శ్రీకృష్ణ ప్రతిమ ఊరేగింపు జరుగుతుందని, భక్తులు ఈ వేడుకల్లో పాల్గొని స్వామివారి కృపను పొందాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ కుప్పం రూరల్ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు ప్రకాశ్, కృష్ణారెడ్డి, శరవణ, రాజ్ కుమార్, కృష్ణమూర్తి, ఇందిర, వెంకటలక్ష్మి, పూజ, మైత్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీబీఏ, బీసీఏ కోర్సులు

కుప్పం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని ప్రభుత్వ డిగ్రీ కాశాలలో నూతనంగా బీబీఏ, బీసీఏ కోర్సులు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కేవీ చిదంబరం తెలిపారు. ఈ కోర్సులకు ఉన్న డిమాండు దృష్ట్యా న్యూఢిల్లీ ఏఐసీటీఈ అనుమతి పొందామన్నారు. బీబీఏ, బీసీఏ కోర్సులతోపాటు బీకామ్ కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ ఫిజిక్స్, బీఎస్సీ జువాలజీ, బీఏ ఎకనామిక్స్, బీఏ స్పెషల్ తెలుగు కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ సౌకర్యం ఉందన్నారు. కార్పొరేట్ కళాశాల కంటే మెరుగైన నాణ్యమైన విద్యను, అనుభవజ్ఞులు, ఆయా సబ్జెక్టులలో అర్హత కలిగిన నిపుణులైన అధ్యాపకులచే అందిస్తున్నామని చెప్పారు. ఆగస్టు 18 నుంచి ఆన్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియ మొదలవుతుందని, సంబంధిత వివరాలకు ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం



మృతుడి కుటుంబ సభ్యుకు ఆర్థికసాయం అందిస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం బందార్లపల్లె పంచాయతీ కడమానువంకకు చెందిన తిమ్మప్పనాయుడు ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి స్థానిక నేతలతో కలిసి నారాయణరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ తరపున రూ.10 వేలు ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి రవిరెడ్డి, పార్టీ పంచాయతీ అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి మునిరెడ్డి, వెంకటరమణ, నేతలు చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, ప్రకాష్, గిరి, మంజునాథనాయుడు, రాఘవేంద్ర నాయుడు, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా హంద్రీ-నీవా బ్రిడ్జి మలుపు



రాజుపేట సమీపంలో హంద్రీ-నీవా బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న గుంతలు

రామకుప్పం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం రామకుప్పం-రాజుపేటక్రాస్ రహదారిలో రాజుపేట సమీపంలోని హంద్రీ-నీవా కాలువ బ్రిడ్జి మలుపు ప్రమాద కరంగా ఉంటోంది. మండల కేంద్రం రామకుప్పం నుంచి మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. కొన్నేళ్లుగా రహదారి మర్మతులకు నోచుకోక పోవడంతో హంద్రీ-నీవా కాలువ బ్రిడ్జి ఇరువైపులా పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. రాకపోకల్లో వాహనదారులు ఏ మాత్రం అజాగ్రత్త వహించినా ప్రమాదానికి గురికావాల్సిందే. ఇప్పటికే ఓ ఆటో, రెండు ద్విచక్రవాహనాలు అదుపుతప్పి పలువురు గాయపడ్డారు. కాలువ బ్రిడ్జి మలుపు వద్దే కాకుండా ఈ రహదారి పలు చోట్ల గతుకులమయంగా మారింది. గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో గతుకులుగుంతలుగా మారుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

పుంగనూరు రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం కుమ్మరగుంట మార్గంలో ఆదివారం సాయంత్రం గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి కథనం మేరకు... మండలంలోని వనమలదిన్నె పంచాయతీ కుమ్మరగుంట గ్రామానికి చెందిన నారాయణప్ప కుమారుడు వెంకటేశ్(35) సొంత పనులపై ద్విచక్రవాహనంలో పక్క గ్రామానికి వెళ్లి పనులు పూర్తి చేసుకుని స్వగ్రామానికి తిరిగి వెళుతుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ప్రమాదంలో వెంకటేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంకటేశ్‌ను పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్ల సూచనల మేరకు తిరుపతికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

40 మందికి కంటి చికిత్సలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

రామకుప్పం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాల ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం రామకుప్పం వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయ ఆవరణలో నిర్వహించిన ఉచిత కంటి చికిత్స శిబిరంలో 40మంది రోగులకు కంటి పరీక్షలు, చికిత్సలు అందజేశారు. 6 మంది రోగులను శస్త్ర చికిత్సల కోసం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో వైద్యులు విక్రమ్, పృథ్విని, లిఖిత, ఆలయ నిర్వహణ కమిటీ పెద్దలు సీతాపతి, మేనేజర్ రామచంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేస్తున్న పెన్షనర్లు

పలమనేరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వి. గురురాజారావు డిమాండు చేశారు. స్థానిక నార్తు పాఠశాలలో నియోజకవర్గ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో 8వ పే కమీషన్, రాష్ట్రంలో 12వ పే కమీషన్ వెంటనే విడుదల చేయాలని కోరారు. తక్షణమే ఐఆర్ ప్రకటించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గౌస్, కృష్ణమూర్తి, మోహన్, గౌడు, గురుస్వామినాయుడు, ఆంజప్ప, అక్బర్‌బాషా, నాగభూషణం, రెడ్డెమ్మ, సుబ్రహ్మణ్యం, నిజాంసాహెబ్, వినాయకం, పురుషోత్తం, చక్రపాణిశెట్టి, చంగలయ్య తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు పారితోషికం



విజేతలకు పారితోషికం, ట్రోఫీని అందజేస్తున్న మురళీనాథ్, రంజిత్‌షా తదితరులు

పలమనేరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ ఆధ్వర్యంలో గత రెండురోజులుగా పలమనేరులో జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో పలమనేరు, శాంతిపురం జట్లు సంయుక్త విజేతలుగా నిలిచారు. వీరికి పారితోషికంతోపాటు ట్రోఫీలను ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ అందించింది. కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షులు మురళీనాథ్, క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు రంజిత్‌షా, టీచర్ సుబ్రహ్మణ్యం, కన్వీనర్లు ఎం.రామరాజు, జప్రుల్లా, సాయిబంగారం, రంగనాథ్ పాల్గొన్నారు.

పలమనేరు సింగిల్ విండో అధ్యక్షుడిగా వెంకటరమణ



పలమనేరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పలమనేరు సింగిల్ విండో అధ్యక్షులుగా కె.వెంకటరమణ, సభ్యులుగా ఎం.పాపిరెడ్డి, టి.ఎం. రమేష్‌లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వెంకటరమణ అలియాస్ పెద్దబ్బకు సింగిల్‌విండో అధ్యక్ష పదవి లభించడంపై టీడీపీ మండలాధ్యక్షులు నాగరాజ రెడ్డి, పలువురు నాయకులు వెంకటరమణను అభినందించారు.

శివపార్వతుల కల్యాణ మండపానికి విరాళాలు



విరాళం అందజేస్తున్న దాతలు

సోమల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణంలో కొలువుదీరిన స్వయం భేశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా నిర్మాణంలోని శివపార్వతుల కల్యాణ మండపానికి పలువురు దాతలు విరాళం అందజేసినట్లు ఆలయ ధర్మకర్త బీవీ. సోమశేఖర్ తెలిపారు. ఆదివారం స్థానిక ఆలయంలో సోమలకు చెందిన మొగిలప్పగారి మల్లయ్య, నాగమ్మ కుమారులు ఎం.రామ్మూర్తి, వెంకటరత్నం, సుబ్బయ్య రూ. 50,116, దిడ్డివారిపల్లెకు చెందిన కర్రి వెంకటస్వామి, రత్నమ్మ దంపతులు రూ. 25, 116, సోమలకు చెందిన గన్నా సీతారామయ్య రూ.11 వేలు విరాళంగా అందజేశారు. అలాగే సోమలకు చెందిన పచ్చిపులుసు సురేశ్ 10 ఫ్యాన్లను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు విద్యాసాగర్, లింగయ్య, రామసిద్దులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాసుల దినోత్సవం



పరిశోధక విద్యార్థి మునెయ్యను సన్మానిస్తున్న గిరిజన సంక్షేమ సంఘ నాయకులు

పలమనేరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు పాతపేట ఎస్టీ కాలనీలో ఆదివారం ఆదివాసుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జానపద సాహిత్యంలో ఎరుకల సంస్కృతి, బాషా సాహిత్యాలు అనే అంశంపై ద్రవిడ విశ్వవిద్యాలయంలో పరిశోధన చేస్తున్న విద్యార్థి సి.మునెయ్యను శాలువతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయనకు గిరిజన సాహిత్యం, కళలకు సంబంధించిన పుస్తకాలను గిరిజన సంఘ నేతలు అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు కె.వీ.రమణ, సి.పి. ప్రకాష్, యువరాజ్, డాక్టర్ అరుణ, పలమనేరు బాలాజీ , గ్రామీణ బ్యాంకు మేనేజర్ తిరుమలరావు, కౌన్సిలర్ కె.ఎం. నాగరాజు, మనోజ్, రాజేష్, సురేష్, నరేష్, బాలవర్థిరాజు, కె.వి. ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిన్నచెరువులో 'కబ్జా'ల పంట

● ఆక్రమణలో చెరువులు ● సాగు భూమిగా మారిన వైనం ● పట్టించుకోని రెవెన్యూ అధికారులు



ఆక్రమణదారులు సాగుకు సిద్దం చేసిన చెరువు



చిన్న చెరువులో సాగు చేసిన కాలీఫ్లవర్ పంట

పుంగనూరు రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు, చెరువులను రాజకీయ పలుకుబడి, ధనవంతులు ఇష్టారాజ్యంగా ఆక్రమించుకుంటూ సాగుభూములుగా మార్చుకుంటున్నా రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. పుంగనూరు మండలం ఏతూరు రెవెన్యూ గ్రామపరిధిలోని సర్వేనంబర్ 163/2-3లో దాదాపు 13.88 ఎకరాల విస్తీర్ణంలో చిన్నచెరువు ఉంది. గతంలో వర్షానికి చిన్నచెరువు నిండటంతో భూగర్భజల మట్టం పెరిగి వ్యవసాయ రైతులు, ప్రజలకు ఉపయోగంగా ఉండేది. అయితే గ్రామంలో పలుకుబడిగల కొంతమంది వ్యక్తులు చిన్నచెరువును దాదాపు 8 నుంచి 10 ఎకరాలు చదును చేసి వ్యవసాయ పొలంగా తయారు చేసి పంటలు సాగు చేస్తున్నారు. చెరువు కట్ట వరకు చెరువు ఆక్రమించి బోరుపైపులు వేసి ఆక్రమణదారులు దర్జాగా సాగు చేస్తున్నారు. గ్రామంలో వీఆర్ఏ, వీఆర్వోలు, సచివాలయ అధికారులు ఉన్నా ఎవరూ చిన్న చెరువు ఆక్రమణలు గురించి కనీసం అటు వైపు చూసిన దాఖలాలు లేవని గ్రామంలోని కొంతమంది బహిరంగానే విమర్శిస్తున్నారు. రాజకీయ పలుబడి కలిగిన వారు కావడంతో వారు చెరువులు, కుంటలు, వంకలు, ప్రభుత్వ భూములు ఆక్రమించినా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని.. భూమి లేని నిరుపేదలు మాత్రం ఎక్కడైనా చెరువు పోరంబోకు, వంక పోరంబోకు భూమిలోకి వెళ్లి వ్యవసాయం కోసం చదును చేసే లోపే రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకుని అడ్డుపడుతారని మరో వైపు విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనపా సంబంధిత అధికారులు చిన్నచెరువును సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై పుంగనూరు తహసీల్దార్ రామును వివరణ కోరగా ఏతూరు చిన్నచెరువు ఆక్రమణ విషయం తన దృష్టికి రాలేదని, విచారించి ఆక్రమణలు తొలగించడానికి చర్యలు తీసుకుంటామని వివరించారు.

సోమల మండలంలో భారీ వర్షం

● ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు



నంజంపేట సమీపంలో ప్రవహిస్తున్న గార్గేయ నది

సోమల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి జోరుగా వర్షం కురుస్తోంది. గత మూడు రోజులుగా అత్యధికంగా వర్షం కురుస్తుడటంతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రెడ్డివారిపల్లె వద్ద గార్గేయనది ఉధృతితో రాకపోకలు స్తంభించాయి. రాంపల్లె ప్రధాన రోడ్డు మార్గం, దేవళకుప్పం సీతమ్మచెరువు వంకలు వేగం పుంజుకున్నాయి. జోరు వానలతో టమోటా రైతులు పొలాల్లో నీటి నిల్వలు లేకుండా ఉండేందుకు పొలాల వైపు పరుగులు పెడుతున్నారు. టమోటా ధరలు ఆశాజనకంగా 15 కిలోల బాక్సు రూ.700 అమ్మకంతో రైతులు ఉత్సాహంగా టమోటా తోటలు కాపాడుకోవడానికి మందులు పిచికారీ చర్యలు చేపట్టారు. ఆదివారం వల్లిగట్ల, చిన్నఉప్పరపల్లె, సోమల, నడింపల్లె పంచాయతీల్లో మోస్తరుతో పాటు భారీ వర్షం కురుస్తుంది. పాడి రైతులు పశువులకు మేత లేక ఇబ్బందులు పడుతున్న వేళ ఈవర్షం ఆనందాన్ని నింపుతుంది.

నైపుణ్యం పెంచడానికే వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పుంగనూరు రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని పెంపొందించడానికే వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు పుంగనూరు వారాహి గ్రూప్స్ ప్రతినిధి హేమంత్‌రాయల్ తెలిపారు. ఆదివారం స్థానిక లినార్డు హైస్కూల్‌లో స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రపై 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీ పరీక్షల్లో దాదాపు వంద మంది విద్యార్థులు పాల్గొనగా.. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆగస్టు 15న ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

మాధవ్ పర్యటన విజయవంతం చేయండి



మాట్లాడుతున్న బీజేపీ మండలాధ్యక్షులు కడియాల మనోహర్

చౌడేపల్లె, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ పర్యటన విజయవంతం చేయాలని బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు కడియాల మనోహర్ కోరారు. ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులుగా మాధవ బాధ్యతలు స్వీరించిన తరువాత మొదటి సారి జిల్లాకు వస్తున్నారని.. అధిక సంఖ్యలో బీజేపీ కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గండోడి ప్రవీణ్, నాయకులు శేఖర్‌బాబు, రెడ్డెప్ప పాల్గొన్నారు.

విశ్రాంత విద్యుత్ ఉద్యోగుల నూతన అధ్యక్షుడిగా కృష్ణమూర్తి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కృష్ణమూర్తి

పుంగనూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు విశ్రాంత విద్యుత్ ఉద్యోగుల సంఘ నూతన అధ్యక్షుడిగా కృష్ణమూర్తి ఎంపికైనట్టు సంఘ గౌరవ అధ్యక్షుడు చెంగయ్య తెలిపారు. ఆదివారం పుంగనూరు డివిజన్ పరిధిలోని విశ్రాంత విద్యుత్ ఉద్యోగుల సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు చెప్పారు. నూతన అధ్యక్షుడిగా కృష్ణమూర్తి, కార్యదర్శిగా సురేశ్‌బాబు, కోశాధికారిగా మునిరత్నం, ఉపాధ్యక్షులుగా షంషీర్, నూర్‌జాన్‌బేగం, సహాయ కార్యదర్శులుగా మల్లికార్జున, శంకర్‌నాయక్, గౌరవ సలహాదారులుగా వీరయ్య ఎన్నికయ్యారన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మదనపల్లె సంఘ నాయకుడు చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న అబ్దుల్‌ఖాన్‌సాబ్

పుంగనూరు రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని ఎస్డీపీఐ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్‌ఖాన్‌సాబ్ పిలుపునిచ్చారు. ఆదివారం పుంగనూరులో జరిగిన ఎస్డీపీఐ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల పక్షాన నిరంతరం పోరాటాలు, సేవలు అందిస్తూ ప్రజల్లోకి వెళ్లాలని వివరించారు. రాజకీయంగా బలపడటానికి ప్రతిఒక్కరూ సైనికుల్లా పని చేయాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు హాఫీజ్ అతావుల్లాఖాన్, చాంద్‌బాషా, అన్వర్‌బాషా, అబ్దుల్‌ఘనీ, ఫయాజ్‌బాషా, రోషన్, మహబూబ్, హంజీఫా, కరీం, సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

రొంపిచెర్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండల వాసులకు సోమవారం పులిచెర్ల మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరుగుతుందని.. తహసీల్దార్ అమరనాద్ తెలిపారు. జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, మండల అధికారులు హాజరవుతారని.. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని.. రొంపిచెర్ల మండల ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పుంగనూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొత్త కోర్సుల మంజూరు

పుంగనూరు రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొత్త కోర్సులు ప్రారంభించడానికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. ఉన్నతవిద్య డైరెక్టర్ డాక్టర్ నారాయణభరత్ గుప్త ఆదేశాల మేరకు.. బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సుతోపాటు అదనంగా ఇంగ్లిషు మీడియంలో గౌరవ డిగ్రీ కోర్సులో బీఏ పొలిటికల్ సైన్స్, బీకాం కంప్యూటర్స్ అప్లికేషన్స్, బీకాం జనరల్, బీఎస్సీ కంప్యూటర్ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ మ్యాథ్‌మ్యాటిక్స్ కోర్సులు మంజూరు చేస్తూ జాయింట్ డైరెక్టర్ సి.కృష్ణ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. కొత్త కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

రేపు మండల సమావేశం

కల్లూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజశేఖర్‌బాబు తెలిపారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలని ఆయన కోరారు.

భార్య కనిపించలేదని ఫిర్యాదు

పుంగనూరు రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): తన భార్య కనిపించలేదని భర్త పుంగనూరు పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. బాధితుడి కథనం మేరకు వివరాలు.. పెద్దపంజాణి మండలం బండగుట్టపల్లెకు చెందిన ఆర్.రాజేంద్ర అతని భార్య ఆదెమ్మ ఇద్దరూ పుంగనూరు కోర్టు పనులపై వచ్చి ఆదెమ్మను పుంగనూరులో వదిలి భర్త రాజేంద్ర మదనపల్లెకు వెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. అయితే భార్య ఆదెమ్మ ఇంటికి రాకపోవడంతో ఫిర్యాదు చేశాడు. హెడ్‌కానిస్టేబుల్ జనార్దన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కుమార్తె కనిపించలేదని ...

పుంగనూరు రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పుంగనూరుకు చెందిన ఓ బాలిక (17) గత రెండు రోజుల నుంచి కనిపించలేదని తల్లిదండ్రులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు.

ఘనంగా గుర్రప్పస్వామి గురువుదేవర్లు

సోమల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం చిన్నఉప్పరపల్లె పంచాయతీ నవరంవారిపల్లె, తంగేళ్లమిట్ట గ్రామస్తులు సంయుక్తంగా గుర్రప్పస్వామి ఆలయంలో గురువుదేవర్లు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆదివారం ఆలయం వద్దకు మహిళలు ఉపవాసదీక్షలతో బోనాలు దీలు తీసుకెళ్లి స్వామివార్లకు మొక్కులు తీర్చుకున్నారు. ఐదేళ్లకోసారి జరుపుకునే గురువుదేవర్లు సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సదుంలో వాన

సదుం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సదుం మండల పరిధిలో ఆదివారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు లేకుండా నిలకడగా కురిసిన వర్షంతో చిన్నపాటి కుంటలు, చెరువుల్లోకి నీరు చేరింది. ప్రధానంగా తిమ్మానాయునివారిపల్లె పంచాయతీ పరిధిలోని కొర్లకుంటవారిపల్లె సాగునీటి ప్రాజెక్టు పొంగి పొర్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ప్రాజెక్టు ఎగువన ఉన్న సోమల మండలంలో గత రెండు, మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రాజెక్టులోకి జోరుగా వర్షపు నీరు చేరి 95 శాతం పైగా నిండినట్లు వారు తెలిపారు. మరికొన్ని గంటల్లో ప్రాజెక్టు మొరవ పోయేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్థానిక రైతులు అభిప్రాయపడ్డారు. ప్రాజెక్టు మొరవ పోతే గార్గేయ నది ప్రవహిస్తుందని తెలిపారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌ను కలిసిన అయూబ్‌ఖాన్



పుంగనూరు, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్. మాధవ్‌ను ఆదివారం పుంగనూరు బీజేపీ రాష్ట్ర మైనార్టీ నాయకుడు పి.అయూబ్ ఖాన్ మర్యాద పూర్వకంగా కలిశారు. శోభయాత్ర కార్యక్రమంలో భాగంగా రాయచోటిలో ఆయనను కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి బీజేపీ పటిష్ఠతపై చర్చించినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట బీజేపీ ఎస్సీ మోర్చా నాయకుడు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

చెస్ విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు జ్ఞాపికలు అందిస్తున్న సీఐ విక్రమ్, లయన్స్ క్లబ్ సభ్యులు

నగరి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నగరిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన చిత్తూరు ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. సీనియర్స్ విభాగంలో హేమాద్రి(నగరి) ప్రథమ, ఆనంద మోహన్ (తిరుపతి) ద్వితీయ, వల్లభాచార్యులు (తిరుపతి) తృతీయ స్థానాలను సాధించారు. అండర్-16 జూనియర్ల విభాగంలో సాయిచరణ్ (తిరుపతి) ప్రథమ, గోపినేని మోక్షిత (తిరుపతి) ద్వితీయ, సాత్విక్‌కృష్ణ (తిరుపతి) తృతీయ స్థానాలను దక్కించుకున్నారు. అండర్-9 జూనియర్ విభాగంలో నాగధృవిక (తిరుపతి) ప్రథమ, ద్వారకార్జున్ (చిత్తూరు) ద్వితీయ, సహస్ర (తిరుపతి) తృతీయస్థానాలను సాధించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నగరి సీఐ విక్రమ్ విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. సీఐ విక్రమ్ మాట్లాడుతూ చదరంగం ఆలోచనతో కూడిన మేథో సంపత్తిని పెంపొందిస్తుందన్నారు. ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రభు మాట్లాడుతూ నగరిలో గత 28 సంవత్సరాలుగా నిరాటంకంగా చదరంగం పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా చైర్‌పర్సన్ ప్రభాకర్‌రాజు, నగరి లయన్స్‌క్లబ్ అధ్యక్షులు గజేంద్ర, కార్యదర్శి మోహన్, కోశాధికారి శక్తివేల్, సభ్యులు నవీన్‌కుమార్, ఆదికేశవులు, ఆదినారాయణ, శ్రీనివాసులు, ఖలీల్‌బాషా పాల్గొన్నారు.

అలరించిన దుర్యోధన వధ



యుద్ధ సన్నివేశాన్ని రక్తికట్టిస్తున్న భీమ, దుర్యోధన పాత్రధారులు

పాలసముద్రం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్ఆర్ఆర్ కండ్రిగలో వున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో ఆదివారం దుర్యోధన వధ ఘట్టాన్ని నిర్వహించారు. ముందుగా ద్రౌపదీ, పాండవుల విగ్రహాలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భీమ, దుర్యోధన పాత్రధారులు యుద్ధ సన్నివేశంలోని పద్యాలు పాడుతూ రక్తికట్టించారు. మధ్యాహ్నం ఆలయ ధర్మకర్త మురళీనాయుడు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సాయంత్రం అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. ఈ నెల 1వ తేదీ నుంచి ప్రారంభమైన తిరుణాళ్ల ఆదివారంతో ముగిసింది.

అ'పూర్వ' కలయిక



కత్తెరపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

వెదురుకుప్పం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): అ'పూర్వ' కలయికకు కార్వేటినగరం మండలం కత్తెరపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల ఆదివారం వేదికయింది. నాలుగు దశాబ్దాల తరువాత ఆ నాటి విద్యార్థులు ఒకటయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకున్నారు. జీవిత విశేషాలను పాలుపంచుకున్నారు. గురువులను సన్మానించారు. ఆ పాఠశాలలో 1983 - 84 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఒకటయ్యారు. హెచ్ఎం చెంగల్రాజు పాల్గొన్నారు.

13న తోతాపురి మామిడి రైతుల నిరసన



రైతులతో సమావేశమైన నాయకులు

బంగారుపాళ్యం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): చిత్తూరులో ఈ నెల 13వ తేదీన జరిగే నిరసన కార్యక్రమానికి తోతాపురి మామిడి రైతులు తరలిరావాలని మామిడి సంక్షేమ సంఘ నాయకులు హరిబాబు చౌదరి, ఆనంద నాయుడు తెలిపారు. ఆదివారం స్థానిక మార్కెట్ యార్డు ఆవరణంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన తోతాపురి మామిడి టన్నుకు రూ.12 వేల మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయాలని జిల్లా వ్యాప్తంగా సంతకాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈనిరసన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మామిడి రైతులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నేతాజీ నాయుడు, రామ్మూర్తి నాయుడు, జయనాయుడు, ఢిల్లీ బాబు, వరదరాజులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



యూటీఎఫ్ జెండాకు వందనం చేస్తున్న నాయకులు

ఐరాల, ఆగస్టు 10(ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రమైన ఐరాలలోని ఎంఆర్సీ భవనం వద్ద యూటీఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ సంఘ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు సోమశేఖర్ నాయుడు మాట్లాడుతూ యూటీఎఫ్ ఏర్పడి 51 సంవత్సరాలు పూర్తి చేసుకుని 52వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘ జిల్లా కార్యదర్శి ఏకాంబరం, నాయకులు ప్రభాకర్, అరుణ్ కుమార్, మహిళా అధ్యక్షులు అమ్ములు, రాధిక, గాయత్రి, మోహన్ బాబు, జగన్నాథ నాయుడు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఓంశక్తి అమ్మవారి ఊరేగింపు



ఓంశక్తి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

పూతలపట్టు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడిరెడ్డికండ్రిగ చిన్నకలికిరి గ్రామ సమీపాన గల ఓంశక్తి ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పలురకాల అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని మంగళవాయిద్యాల నడుమ బాణసంచా కాలుస్తూ పలుగ్రామాల్లో ఊరేగించగా, భక్తులు అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఓంశక్తి భక్తులు కార్యనిర్వాహకులుగా వ్యవహరించారు.

ఆడికృత్తిక ఉత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కూటమి నాయకులు

వెదురుకుప్పం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం కుమరగిరి కొండపై ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఆడికృత్తిక ఉత్సవాల పోస్టర్లను ఆదివారం ఈవో కృష్ణనాయక్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ నెల 15వ తేది నుంచి 3 రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని ఈవో తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ద్రౌపదీదేవి తిరునాళ్లలో ఎమ్మెల్యే భానుప్రకాష్



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని సత్రవాడలో జరుగుతున్న ద్రౌపదీదేవి తిరునాళ్లలో ఆదివారం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అర్చకుల వేదమంత్రోచ్చారణల మధ్య ఆయనకు ఆలయ మర్యాదలు చేపట్టారు. కార్యక్రమంలో కరుణ, శ్రీనివాసన్, టీడీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏపీ ప్రభుత్వ డ్రైవర్ల సెంట్రల్ అసోసియేషన్ సహాధ్యక్షుడిగా పన్నీర్‌సెల్వం



చిత్తూరు అర్బన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డ్రైవర్ల సెంట్రల్ అసోసియేషన్ సహాధ్యక్షుడిగా పన్నీర్‌సెల్వంను ఎన్నుకున్నారు. ఆదివారం గుంటూరులోని ఏపీ ఎన్జీవో భవనంలో ప్రభుత్వ డ్రైవర్ల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా మాజీ అధ్యక్షుడిగా ఉన్న పన్నీర్‌సెల్వం సేవలను గుర్తించిన రాష్ట్ర కార్యవర్గం ఆయన్ను రాష్ట్ర సహాధ్యక్షుడిగా నియమించింది. కార్యక్రమంలో ఆ సంఘం ఆలిండియా అధ్యక్షుడు నాగేశ్వరరావు, 13 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, ఇతర ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

చిత్తూరు అర్బన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం చోరీపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేర కు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. గిరింపేటకు చెందిన దొరస్వామి నాయుడి కుమారుడు బాబు నాయుడు స్థానికంగా ఉన్న ఓ హేచరీస్‌లో పనిచేస్తున్నాడు. ఈ నెల 2వ తేదీన ఆర్టీవో కార్యాలయానికి పనిమీద వెళ్లాడు. బయట వాహనాన్ని ఆపి పనులు చూసుకుని బయటికి వచ్చి చూడగా, వాహనం కనపడలేదు. దాంతో ఆదివారం బాబు నాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

15 నుంచి ఆడికృత్తిక మహోత్సవాలు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): గిరింపేట చెంగల్రాయ కొండ వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర ఆలయంలో ఈనెల 15, 16 తేదీల్లో ఆడికృత్తిక మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో వెంకట సుబ్బారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 15న స్వామివారికి భరణీ నక్షత్ర ఉత్సవం, 16న ఆడికృత్తిక ఉత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు స్వామి వారికి కావళ్లను సమర్పించడానికి అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. బజారు వీధిలోని శివషణ్ముగ సుందర వినాయక ఆలయంలో ఈనెల 15, 16 తేదీల్లో ఆడి భరణీ నక్షత్ర, ఆడి కృత్తిక పూజలు నిర్వహిస్తున్నామని ఈవో వెంకటరాయలు తెలియజేశారు.

16న శ్రీకృష్ణాష్టమి

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఈ నెల 16వ తేదీన శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ఆదివారం నగరంలోని హైరోడ్ గోకుల కృష్ణాలయం, చర్చి వీధి సంతాన వేణుగోపాల స్వామి ఆలయం, శ్రీనగర్ కాలనీ వేణుగోపాల స్వామి ఆలయాల నిర్వాహకులు తెలిపారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, ఉట్టి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

భక్తులకు అన్నదానం



భక్తులకు అన్నదానం చేస్తున్న దాతలు

వెదురుకుప్పం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం పుత్తూరు పట్టణానికి చెందిన ఎంఎం వేదవ్యాస వితరణతో భక్తులకు అన్నదానం జరిగింది. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

అరుణానగర్‌లో పోలీసుల కార్డన్‌సెర్చ్



కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్న ఎస్ఐ నరసింహులు, సిబ్బంది

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కాణిపాకం పోలీస్ స్టేషన్ పరిధిలోని అరుణానగర్, వినాయకపురం తదితర గ్రామాల్లో ఎస్ఐ నరసింహులు తన సిబ్బందితో కలసి ఆదివారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఈ గ్రామాల్లో సరైన రికార్డులు లేని 6 ద్విచక్ర వాహనాలను స్వాధీనపరచుకున్నట్లు తెలియజేశారు. ద్విచక్ర వాహనాలకు సరైన రికార్డులు, లైసెన్స్ లేకున్నా, హెల్మెట్ ధరించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

దేశమ్మ ఆలయంలో ఆడిమాస ఉత్సవాలు

నగరి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని దేశమ్మ ఆలయంలో ఆడిమాసోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉత్సవాలలో భాగంగా ఆదివారం అమ్మవారు సంతానలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. తమిళనాడుకు చెందిన మహిళా భక్తులు సైతం అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

నేడు నగరపాలక కార్యాలయంలో 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): నగరపాలక కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ నరసింహ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామని తెలిపారు. బాధిత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి సంబంధిత అధికారులు హాజరుకావాలని కోరారు.



చిత్తూరులోని పలమనేరు రోడ్డులో కురుస్తున్న వర్షం, మిట్టూరులోని రంగారెడ్డివీధిలో నిల్వ ఉన్న నీరు, బొమ్మవారిపల్లె వద్ద వంకలో పారుతున్న వర్షపునీరు

చిత్తూరులో భారీ వర్షం

- పల్లపు ప్రాంతాలకు చేరిన వర్షపునీరు
- ఇబ్బందులు పడ్డ ప్రజలు

చిత్తూరు అర్బన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన చిత్తూరులో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ బాగా ఉన్నప్పటికీ సాయంత్రం 4 గంటలకు వర్షం ప్రారంభమైంది. అప్పటి నుంచి రాత్రి వరకు పడుతూనే ఉంది. దాంతో మిట్ట ప్రాంతాల్లోని వర్షపు నీరంతా పల్లపు ప్రాంతాలైన మిట్టూరు, పొన్నియమ్మన్ కోవిల్ వీధి, గంగనపల్లె, ఓబనపల్లె ప్రాంతాలకు చేరింది. మురుగుకాల్వలోని నీరంతా రోడ్లపైకి రావడంతో చెత్తాచెదారమంతా రోడ్లపై పేరుకుపోయింది. ఆదివారం కావడంతో ప్రయాణికుల తాకిడి కూడా తక్కువగా ఉండటంతో పెద్ద ఇబ్బందులు ఏర్పడలేదు. వీధి వ్యాపారులకు మాత్రం తీవ్ర నష్టం వాటిల్లింది.

రంగారెడ్డివీధిలో...

చిత్తూరు రూరల్: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి మిట్టూరులోని రంగారెడ్డివీధి నీట మునిగింది. మోకాళ్ల లోతు నీటిలో ప్రయాణించలేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వీధిలోని కార్‌పార్కింగ్ వరదనీటిలో నిండిపోయింది. వీధికి ఆనుకొని వున్న మెరువకాలువ ఆక్రమణకు గురికావడంతో వరదనీరు వీధిలోకి చేరుతోంది. పాములు, విషపురుగులు కొట్టుకొస్తున్నాయి. చిన్నపాటి వర్షానికే పరిస్థితి ఇలా ఉంటే పెద్ద వర్షం పడితే నీరు ఇళ్లలోకి రావడం ఖాయం. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ దీనిపై చర్యలు తీసుకోకుంటే వరదనీరు రంగారెడ్డివీధిని ముంచెత్తుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నగరిలో కురుస్తున్న వర్షం

వంకపైగా పారిన వర్షపునీరు

గంగాధరనెల్లూరు: మండలంలో నాలుగురోజులుగా కురిసిన వర్షానికి కలిజవేడు పంచాయతీ బొమ్మవారిపల్లె వద్ద వంకలో ఆదివారం వర్షపునీటి ప్రవాహం ఎక్కువగా సాగింది. దీంతో బొమ్మవారిపల్లె, పాపిరెడ్డిపల్లె గ్రామాలకు రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ద్విచక్ర వాహనదారులు, పాదచారులు మరో ఐదారు కిలోమీటర్లు దూరం వెళ్ళి ఇళ్ళకు చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గంగాధరనెల్లూరు - తూగుండ్రం రహదారిలో కండ్రిగ దళితవాడ వద్ద నడిరోడ్డుపై వర్షపునీరు నిలిచిపోవడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు.

నగరిలో...

నగరి: నగరిలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పట్టణంలో జనజీవనం స్తంభించింది. సాయంత్రం 4.15 నుంచి 6 గంటల వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలలో వర్షపు నీరు నిలిచిపోయింది.

101వ పుట్టినరోజు జరుపుకున్న మనెమ్మ



నగరి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): 50 సంవత్సరాలు పూర్తవగానే రోగాలతో ఎప్పుడు చనిపోతారో తెలియని నేటి కాలంలో నగరి పట్టణంలోని కృష్ణానగర్‌కు చెందిన ఎం.మనెమ్మ మనవళ్లు, మనవరాళ్లు, ముని మనవళ్లు, ముని మనవరాళ్లు 70 మందితో కలిసి ఆదివారం పుట్టినరోజు పండుగ జరుపుకోవడం విశేషం.

గంగజాతరను వైభవంగా నిర్వహిద్దాం



సమావేశంలో పాల్గొన్న గ్రామపెద్దలు

నగరి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): నగరి గంగజాతర విశిష్టతకు మారుపేరని, ఈ ఏడాది కూడా వైభవంగా నిర్వహిద్దామని జాతర నిర్వాహకులు పిలుపునిచ్చారు. పట్టణ పరిధిలోని కరకంఠేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం గంగజాతర నిర్వహణపై గ్రామసభ నిర్వహించారు. గత సంవత్సరం జాతర నిర్వహణకు సంబంధించిన జమా ఖర్చులను, నిల్వ వున్న మొత్తం, అమ్మవారికి అందిన కానుకలు, దాతలు అందించిన సహకారాలను నిర్వాహకులు చిరంజీవిరెడ్డి గ్రామసభలో వివరించారు. సెప్టెంబరు 2 వతేదిన చాటింపు, 9, 10, 12 తేదిలలో జాతర జరుగుతుందని నిర్ణయించారు. సామాలమ్మ ఆలయ నిర్వాహకులు రామానుజం చలపతి మాట్లాడుతూ గత ఏడాది చాటింపు సందర్భంగా వర్షం రావడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారని, ఈ ఏడాది తన సొంత నిధులు సుమారు రూ.7లక్షలతో షెడ్డు, వంటగది ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జ్యోతిరెడ్డి, కృష్ణారెడ్డి, ఆనం సురేష్, దయానిధి, గుణశేఖర్, జ్యోతినాయుడు, బాబు, గోపాల్‌రెడ్డి, ఇంద్రయ్య, హరిబాబు, రామూర్తి యాదవ్, ఎం.వి.హరిబాబు, సుబ్రమణ్యం, ఎం.వి.శ్రీనివాసులు, టీకే శ్రీనివాసన్, ఎంవి.బాబు, రమేష్, వెంకటముని, కేపమణి, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

మునీశ్వరస్వామికి వార్షికోత్సవ పూజలు



మునీశ్వరస్వామి పూజల్లో పాల్గొన్న పురుషోత్తం మొదలి తదితరులు

గంగాధరనెల్లూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు మండలం తూగుండ్రం పంచాయతీ తొప్పనపల్లెలో గల అగుముడి మొదలియార్ చారిటబుల్‌ట్రస్ట్ చైర్మన్ పురుషోత్తం మొదలి ఆధ్వర్యంలో మునీశ్వరస్వామి వార్షికోత్సవ పూజలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద హోమం, కలశపూజలు నిర్వహించారు. మూలవిరాట్‌లోని స్వామి విగ్రహానికి అర్చకులు రుషికేష్ పసుపు, కుంకుమ, గంధం, పంచామృతం, కొబ్బరినీళ్ళు, సుగంధద్రవ్యాలతో అభిషేకం పూజలు చేశారు. అనంతరం పట్టువస్త్రాలు, పూలహారాలతో అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో విశ్రాంత ఫారెస్ట్ ఆఫీసర్ శాంతకుమార్, వేలుమొదలి, నటరాజ్ మొదలి, శంకర్ మొదలి, దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న వెంకటేశులు నాయుడు

శ్రీరంగరాజపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ బూత్ కన్వీనర్ బల్ల వెంకటేశులు నాయుడు అన్నారు. ఆదివారం ఎగువకమ్మకండ్రిగలో సుపరిపాలన కార్యక్రమం నిర్వహించారు. ఏడాది ప్రభుత్వ పాలనపై ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కె.రమేష్ నాయుడు, ఆర్.వెంకటేశులు నాయుడు, ఇ.ఏకాంబరం నాయుడు, జగదీష్ నాయుడు, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెనుమూరు ఎస్ఐగా వెంకట నరసింహం



పెనుమూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు నూతన ఎస్ఐగా వి.వెంకట నరసింహం ఆదివారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం నుంచి బదిలీపై చిత్తూరు జిల్లాకు రాగా ఈయనకు ఎస్పీ పెనుమూరు ఎస్ఐగా పోస్టింగ్ ఇచ్చారు. ఇంతకుముందు ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న రామచంద్రయ్య అనంతపురానికి బదిలీ అయిన విషయం తెలిసిందే.

వైభవంగా ఆడి తిరునాళ్ల

విజయపురం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలో తమిళ ఆడినెల నాలుగవ ఆదివారంను పురస్కరించుకొని ఆడి తిరునాళ్ల వైభవంగా నిర్వహించారు. కోసలనగరంలో పెద్దపాళెమ్మకు పొంగళ్లపెట్టి ఆలయంలో భక్తులు అంబలి పోసి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీహరిపురంలో పడవేటమ్మ ఆలయంలో, జన్నాథపురం, పన్నూరు, మహారాజపురంలో గ్రామ దేవతకు భక్తులు పొంగళ్లు పెట్టారు.

ఒంటిమిట్టలో పూతలపట్టు ఎమ్మెల్యే ప్రచారం



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, ఆగస్టు 10 (ఆంధ్ర జ్యోతి): కడప జిల్లా ఒంటిమిట్టలో జరుగుతున్న జడ్పీటీసీ ఉపఎన్నికల్లో కూటమి జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీచేస్తున్న ముద్దుక్రిష్ణారెడ్డి విజయం కోసం పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ ప్రచారం చేశారు. తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం చేసిన పలు అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.

పీఏసీఎస్ చైర్‌పర్సన్‌కు పలువురి శుభాకాంక్షలు



కేక్ కట్‌చేస్తున్న చిత్రానాయుడు

యాదమరి, ఆగస్టు 10 (ఆంధ్ర జ్యోతి): యాదమరి పీఏసీఎస్ చైర్‌పర్సన్ చిత్రా నాయుడి జన్మదినోత్సవం సందర్భంగా ఆదివారం పలువురు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు మురార్జీ యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబీ, నాయకులు హేమగిరి, వల్లేరు అమరనాథ నాయుడు, హరి నాయుడు, విజయేంద్ర యాదవ్ తదితరుల నడుమ ఆమె కేక్ కట్‌చేశారు.

భాగవతారిణికి సన్మానం



భాగవతారిణి శివకుమారిని సన్మానిస్తున్న తుంబకుప్పం జమీందార్ కుటుంబ సభ్యులు

బంగారుపాళ్యం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంబకుప్పంలో ద్రౌపదమ్మ ఆలయంలో మహాభారత ఉత్సవం ఘనంగా జరుగుతోంది. ఈ సందర్భంగా ప్రతి రోజు మధ్యాహ్నం గాన ప్రవీణ, నంది అవార్డు గ్రహీత, భాగవతారిణి డాక్టర్ ఎస్.శివకుమారిచే హరికథా కాలక్షేపం జరుగుతోంది. ఆదివారం తుంబకుప్పం ఎస్టేట్ మాజీ జమీందార్ మనవడు, మండల తెలుగు యువత మాజీ అధ్యక్షుడు బీకే గిరిబాబు, కుటుంబ సభ్యులు త్రివేణి, ప్రశాంత్, బీకే జ్ఞానసుప్రియలు ఆమెకు చీర, సారెను బహూకరించి సన్మానించారు.

కోదండరామాపురం రోడ్డుకు మరమ్మతులు



ఆర్ అండ్ బీ రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న కార్మికులు

పాలసముద్రం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి కోదండరామాపురం వెళ్లే రోడ్డు గుంతలమయం కావడంతో కూటమి ప్రభుత్వం తారురోడ్డు మరమ్మతు పనులను ఆదివారం ప్రారంభించింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ రోడ్డుకు మరమ్మతు పనులు చేయకపోవడంతో గుంతలమయంగా మారింది. దీంతో ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే థామస్ ఈ రోడ్డుకు మరమ్మతులు చేయడానికి నిధులు మంజూరు చేయించడంతో కాంట్రాక్టర్ ఆదివారం మరమ్మతు పనులను ప్రారంభించారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

బంగారుపాళ్యం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): చెన్నై శంకర్‌నేత్రాలయ - మిషన్ ఫర్ విజన్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు శంకర్ నేత్రాలయ సిబ్బంది మురళీకృష్ణ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి కంటి సమస్యలు ఉన్నవారిని పరీక్షించి, ఆపరేషన్లు అవసరమైన వారికి చెన్నైలోని శంకర్ నేత్రాలయంలో ఉచితంగా చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ శిబిరాన్ని కంటి సమస్యలు ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ముస్తాబవుతున్న సుబ్రహ్మణ్యేశ్వర ఆలయాలు

గుడిపాల, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలకు ఈ నెల 15, 16 తేదీల్లో కావళ్లు చెల్లించడానికి భక్తులు వస్తున్న నేపథ్యంలో ఆలయాలను నిర్వాహకులు ముస్తాబు చేస్తున్నారు. ఇప్పటికే రంగులు వేయడంతో పాటు మరమ్మతు పనులు చేపడుతున్నారు. మండలం నుంచే కాకుండా ఇతర మండలాలు, ప్రాంతల నుంచి భక్తుల అధిక సంఖ్యలో రానున్న నేపథ్యంలో బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నారు. మండలంలోని కందగిరి కొండలో వెలిసిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, చిత్తపార, అడవిచేను గ్రామాల్లో ఉన్న ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.